సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 20 । ఏప్రిల్ । 2024



సోమశిలలో 8.48 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో శుక్రవారం సాయంత్రానికి 8.48 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 70 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.75,950
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.6,802
3శాతం జీఎస్టీతో	రూ.7,006
నవర (8గ్రాములు)	రూ.56,048



షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు ఆహుతి

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు కాలి బూడిదైన ఘటన మనుబోలు మండలం అనువల్లిపాడులో చోటుచేసుకుంది. రూ.పది లక్షల ఆస్తినష్టం సంభవించింది. 8లో

న్యూస్‌రీల్

కొనసాగుతున్న తనిఖీలు

నెల్లూరు(క్రైమ్): ఎన్నికల నేపథ్యంలో మద్యం, నగదు అక్రమ రవాణా కట్టడే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా పోలీసులు, ఎస్‌ఈబీ అధికారులు తనిఖీలను కొనసాగిస్తున్నారు. కావలి ఒకటో పట్టణ పరిధిలో రూ.నాలుగు లక్షలు, బాలాజీనగర్‌లో రూ. 2.13 లక్షలను ఎలాంటి పత్రాల్లేకుండా తరలిస్తుండగా పోలీస్ అధికారులు గురు, శుక్రవారాల్లో స్వాధీనం చేసుకున్నారు. కావలి ఒకటో పట్టణ పరిధిలో 655 టీ కప్పుల సెట్లను స్వాధీనం చేసుకున్నారు. బాలాజీనగర్, ముత్తుకూరులో 15 చొప్పున, బిట్రగుంట, అల్లూరు, ఉదయగిరి, మర్రిపాడు, చేజర్లలో పది చొప్పున, కలిగిరి, దుత్తలూరు, జలదంకి, దగదర్తిలో 11 చొప్పున, ఆత్మకూరులో 25, రాపూరులో 20, కలువాయిలో 18, ఏఎస్‌పేటలో 50, కండలేరులో 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు 143 మద్యం బాటిళ్లను ఎస్‌ఈబీ అధికారులు స్వాధీనం చేసుకొని నిందితులపై కేసులు నమోదు చేశారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



మాట్లాడుతున్న సూర్యనారాయణ

నెల్లూరు(పొగతోట): ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పింఛనర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పింఛనర్ల ఐక్యవేదిక చైర్మన్ సూర్యనారాయణ పేర్కొన్నారు. నగరంలోని ఓ కల్యాణ మండపంలో ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసమే ఐక్యవేదికను ఏర్పాటు చేశామని వివరించారు. సెక్రటరీ జనరల్ బాజీ పఠాన్, కోచైర్మన్ హరికృష్ణ, జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, రమణారెడ్డి, దినేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రచార వాహనాల ప్రారంభం



నెల్లూరు(దర్గామిట్ట): ఎన్నికల ప్రచారానికి సంబంధించిన ఎల్‌ఈడీ స్క్రీన్ల వాహనాలను ఎమ్మెల్సీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ శుక్రవారం ప్రారంభించారు. రామ్మూర్తినగర్‌లోని విజయసాయిరెడ్డి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. గడిచిన ఐదేళ్లలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను ఈ ప్రచార వాహనం ద్వారా అన్ని నియోజకవర్గాల్లో వివరించనున్నామని చెప్పారు. వచ్చే ఐదేళ్లలో ఏ కార్యక్రమాలను అమలు చేయనుందనే అంశాలతో కూడిన వీడియోలను ఎల్‌ఈడీ స్క్రీన్లపై ప్రదర్శించనున్నారని తెలిపారు.

అఫిడవిట్లలో జాగ్రత్తలు పాటించాలి

నెల్లూరు సిటీ: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే క్రమంలో అఫిడవిట్లలో జాగ్రత్తలు పాటించాలని జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ సందర్భాల్లో నోటరీ అఫిడవిట్లను తీసుకోవాల్సి ఉంటుందన్నారు. నామినేషన్ల విషయంలో అఫిడవిట్ ఇచ్చే నోటరీ ఫోర్స్‌లో ఉన్నారానే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. జాగ్రత్తలు పాటించని పక్షంలో అఫిడవిట్ చెల్లుబాటు కాదని పేర్కొన్నారు.

డీపీఓలో పోలీస్ వెల్ఫేర్ డే



సమస్యలను తెలుసుకుంటున్న ఆరిఫ్ హఫీజ్


నెల్లూరు(క్రైమ్): సిబ్బంది సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ సూచించారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ వెల్ఫేర్ డేను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ సమస్యలపై ఎస్పీకి అర్జీలను సిబ్బంది అందజేశారు. వీటిని పరిశీలించి.. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. సిబ్బంది సంక్షేమమే ధ్యేయంగా పోలీస్ వెల్ఫేర్ డేను ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్నామని తెలిపారు.

నాడు కొల్లగొట్టి.. నేడు ఏమార్చి

- భారీగా తవ్వకాలు
- చిన్నారులను బలిగొన్న గుంతలు
- ఈ పాపాలను వైఎస్సార్సీపీకి అంటగట్టేందుకు సోమిరెడ్డి కుట్ర

టీడీపీ హయాంలో బరితెగించిన గ్రావెల్ మాఫియా

తప్పు చేయడం.. దాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఆ నెపాన్ని ఎదుటివారిపై మోపడం టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి వెన్నతో పెట్టిన విద్య. తన ధనదాహంతో అక్రమార్కులకు అండగా నిలిచి.. ఎన్నో ఎకరాల్లో గ్రావెల్‌ను కొల్లగొట్టిన ఘన చరిత్ర కలిగిన ఆయన.. తన పాపాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అంటగట్టేందుకు కొత్త కుట్రకు తెరలేపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామాల్లో పర్యటిస్తున్న ఆయన ఇలా దుష్ప్రచారానికి పాల్పడుతుండటంతో ఆశ్చర్యపోవడం ప్రజల వంతవుతోంది.





గత టీడీపీ హయాంలో చేపట్టిన గ్రావెల్ తవ్వకాలతో గొలగమూడిలోని చాకలి చెరువులో ఏర్పడిన భారీ గుంత (ఫైల్)

వెంకటాచలం: గత టీడీపీ హయాంలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అండతో మండలంలో గ్రావెల్ మాఫియా చెలరేగిపోయింది. విచ్చలవిడిగా చేపట్టిన గ్రావెల్ తవ్వకాలతో భారీగా ఏర్పడిన గుంతలు గ్రామాల్లో నేటికీ దర్శనమిస్తున్నాయి.

అడ్డూఅదుపు లేకుండా అక్రమాలు..

మండలంలో ప్రధానమైన సర్వేపల్లి రిజర్వాయర్, కనుపూరు చెరువుతో పాటు గ్రామాల్లోని అన్ని చెరువుల్లో ఎలాంటి అనుమతుల్లేకుండా గత టీడీపీ హయాంలో గ్రావెల్ రవాణాను అక్రమంగా చేపట్టారు. ఈ వ్యవహారమై అప్పట్లో రైతులు, గ్రామస్తులు పలుమార్లు ఆందోళన చేశారు. అయినా సోమిరెడ్డి అండతో గ్రావెల్ అక్రమ రవాణా అడ్డూ అదుపు లేకుండా సాగింది.

అక్రమ సంపాదనపైనే దృష్టి

2014 ఎన్నికల్లో ఓటమిపాలైన సోమిరెడ్డి దొడ్డిదారిన మంత్రి పదవి దక్కించుకొని.. ప్రజాసంక్షేమాన్ని గాలికొదిలి.. అవినీతి, అక్రమ సంపాదనపైనే దృష్టిని కేంద్రీకరించారు. మండలంలోని సర్వేపల్లి, కనుపూరు రిజర్వాయర్లు, కసుమూరు, ఈదగాలి, తిక్కవరప్పాడు, కంటేపల్లి, సర్వేపల్లి గ్రామాల్లో నిరంతరాయంగా గ్రావెల్‌ను తరంచి కోట్లు వెనకేసుకున్నారు.

ప్రమాదాలకూ కారణమే..

సోమిరెడ్డి ప్రధాన అనుచరుడు బుజ్జినాయుడికి చెందిన టిప్పర్ కనుపూరు చెరువు నుంచి గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తూ జాతీయ రహదారిపై టెంపోను గతేడాది ఆగస్టులో ఢీకొంది. ప్రమాదంలో ఒకరు మృత్యువాత పడగా, ఎనిమిది మంది గాయపడ్డారు. ఈ ఘటననూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలపై రుద్దేందుకు యత్నించి, చివరికి తన అనుచరులదేనని తేలడంతో మిన్నకుండిపోయారు.

అసత్య ఆరోపణలకు ఉదాహరణ

మండలంలోని గుడ్లూరువారిపాళెంలో ఇసుకను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు అక్రమంగా తరలిస్తున్నారంటూ పోలీసులకు ఈ ఏడాది ఫిబ్రవరి 29న సోమిరెడ్డి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అక్కడికెళ్లి నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. తీరా ఆ ట్రాక్టర్లు టీడీపీ నేతలకు చెందినవిగా తేలడంతో కంగుతిన్న సోమిరెడ్డి వాటిని విడిపించేందుకు నానా యత్నాలు చేసి తన తత్వాన్ని బయటపెట్టుకున్నారు.

తప్పుడు ప్రచారాలతో పైశాచికానందం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో పర్యటిస్తున్న సోమిరెడ్డి ఎక్కడికెళ్లినా అసత్య ప్రచారాలు చేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రమేయంతో గ్రావెల్ తవ్వకాలు జరిగాయంటూ తప్పుడు ప్రచారాలకు శ్రీకారం చుట్టారు. అయితే ఈ వ్యవహారాలన్నీ గత ప్రభుత్వంలోనే జరిగాయని ప్రజలకు తెలియడంతో ఆయన్ను ఎవరూ నమ్మడంలేదు.

20 అడుగుల వరకూ తవ్వకాలు..

వర్షాకాలంలో చెరువుల్లో నిండుగా నీరు చేరడంతో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను సైతం వదలకుండా గ్రావెల్‌ను అక్రమంగా తరలించి కోట్లల్లో సొమ్ము చేసుకున్నారు. టీడీపీ నేతల ధనదాహానికి గ్రామానికి ఆనుకొని ఉన్న చెరువులు, ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో భారీగా గుంతలు ఏర్పడ్డాయి. కొన్ని గ్రామాల్లో పది నుంచి ఇరవై అడుగుల లోతు వరకు తవ్వారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

గుంతల్లో పడి బలైన చిన్నారులు

- అనికేపల్లికి చెందిన ఐదో తరగతి విద్యార్థి తురకా వెంకయ్య తోటి విద్యార్థులతో కలిసి గ్రామానికి సమీపంలో ఉన్న సర్వేపల్లి రిజర్వాయర్ వద్దకు ఈత నిమిత్తం గతేడాది జూన్‌లో వెళ్లారు. సోమిరెడ్డి చేపట్టిన గ్రావెల్ తవ్వకాలతో ఏర్పడిన గుంతలో పడి మృత్యువాత పడ్డారు. అయితే ఈ ఘటనను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై మోపేందుకు విఫలయత్నం చేశారు.
- గొలగమూడిలోని చాకలి చెరువులో ఏర్పడిన గుంతలో పడి రెండో తరగతి విద్యార్థి హిమాయతుల్లా గత జూలైలో మరణించారు. ఈ ఉదంతంతో తన పాపాలెక్కడ బయటపడతాయోననే భయంతో గొలగమూడి వెళ్లి ఈ ఘటననూ ప్రభుత్వంపై మోపేందుకు యత్నించారు. ఆ సమయంలో అక్కడే ఉన్న టీడీపీ నేతలు.. ఈ గుంతలు 2016 – 17లో తవ్వినవని చెప్పారు. దీంతో అందరి ముందు సోమిరెడ్డి నవ్వులపాలయ్యారు.



ఇసుకను అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన టీడీపీ నేతల ట్రాక్టర్లు (ఫైల్)

జగన్ హామీలు శిలాశాసనంతో సమానం



మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హామీలు శిలాశాసనంతో సమానమని, అవి చెరిగిపోవని.. అయితే చంద్రబాబు హామీలు నీటిపై రాతల్లాంటివని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పంటపాళెం, ఈపూరు, దొరువుపాళెం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. 2014 ఎన్నికల నాటి టీడీపీ మేనిఫెస్టోను వెబ్‌సైట్ నుంచి తొలగించిన ఘనుడు చంద్రబాబని విమర్శించారు. ఇచ్చిన హామీలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపూర్ణంగా అమలు చేశారని, ఈ కారణంగా ఓట్లడిగేందుకు ప్రజల వద్దకు వస్తున్నామని చెప్పారు. పేదలు.. పెత్తందారుల మధ్య ఈ ఎన్నికలు జరుగుతున్నాయని తెలిపారు. పేదల పక్షాన సీఎం నిలిచి వారి బాగు కోసం పెత్తందారులతో యుద్ధం చేస్తున్నారని పేర్కొన్నారు.

కష్టకాలంలో సోమిరెడ్డి ఎక్కడ..?

కరోనా కష్టకాలంలో సోమిరెడ్డి ఎక్కడికి వెళ్లారో ప్రశ్నించాలని ప్రజలను మంత్రి కోరారు. కరోనా కష్టకాలంలో సర్వేపల్లి ప్రజల కోసం తన ప్రాణాలను సైతం పణంగా పెట్టి.. గ్రామాల్లో పర్యటించి సరుకులను అందజేసిన విషయాన్ని గుర్తుచేశారు. సర్వేపల్లికి సోమిరెడ్డి ఏమి చేస్తే ఓటేయాలో చెప్పాలని ప్రశ్నించారు. ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులను చేపట్టానని, ఓట్లడిగే హక్కు తనకే ఉందన్నారు. తొలుత మంత్రికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఎంపీపీ గండవరం సుగుణ, సర్పంచ్‌లు ఆలపాక శ్రీనివాసులు, అనంతరాజు, శశికుమార్, ఎంపీటీసీ రావి విజయకుమార్‌రెడ్డి, దువ్వూరు విశ్వమోహన్‌రెడ్డి, అనంతరాజు వేణుగోపాల్, విక్రమ్‌రెడ్డి, దువ్వూరు నిరంజన్‌రెడ్డి, ఇసనాక చంద్రశేఖర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తనిఖీలను ముమ్మరం చేయండి

నెల్లూరు(బారకాసు): ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దులు, ఇతర ప్రధాన మార్గాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద తనిఖీలను ముమ్మరంగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనంలో అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రాత్రి వేళల్లోనూ తనిఖీలను ముమ్మరం చేయాలని సూచించారు. గూడ్స్ వెహికల్స్, కంటైనర్లు, లారీలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. నామినేషన్లు ప్రారంభమైన తరుణంలో ఖర్చులను అభ్యర్థుల ఖాతాల్లో జమ చేయాలని సూచించారు. ట్రైయినీ కలెక్టర్ సంజనాసిన్హా, డీఆర్వో లవన్న, నోడల్ అధికారులు బాపిరెడ్డి, పద్మావతి, కన్నమనాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హరినారాయణన్

అశాంతిని రాజేసి.. లబ్ధికి యత్నం

- నామినేషన్ల సమయంలో ఇదీ ప్రశాంతిరెడ్డి తీరు
- టీడీపీ శ్రేణుల గూండాగిరి
- ఎన్నికల కమిషన్ రేఖ దాటి దూసుకెళ్లేందుకు యత్నం
- పోలీసుల సంయమనాన్ని పరీక్షించిన వైనం



పోలీసులపైకి దూసుకొస్తున్న రౌడీమూకలు

కోవూరు: అసలే ఈ ఎన్నికలు చావో..రేవో.. పైగా బలం నామమాత్రం.. నగదుతో ప్రలోభాలకు గురిచేసినా ఆశించిన స్థాయిలో మద్దతు కానరాకపోవడంతో కొత్త ఎత్తుగడను కోవూరు టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెరపైకి తీసుకొచ్చారు. ప్రశాంతతకు మారుపేరైన కోవూరులో అశాంతిని రాజేసి ప్రజల దృష్టిని తమవైపు మరల్చేందుకు గురువారం విశ్వప్రయత్నం చేసిన ఆమె భంగపాటుకు గురయ్యారు.

మందీమార్బలంతో అత్యుత్సాహం

నామినేషన్ దాఖలు సందర్భంగా కోవూరులో ప్రజాస్పందన ఆశించిన స్థాయిలో లేదనే సంకేతాలతో నెల్లూరు నుంచి తన మందీమార్బలాన్ని తీసుకొచ్చి అత్యుత్సాహాన్ని ఆమె ప్రదర్శించారు. వాస్తవానికి ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు నామినేషన్ కేంద్రానికి వంద మీటర్ల దూరంలోనే పార్టీ శ్రేణులు ఆగిపోవాలి. నామినేషన్ దాఖలుకు అభ్యర్థితో పాటు మరో నలుగురికే అనుమతి ఉంటుంది. అయితే ఈ నిబంధనను తుంగలో తొక్కిన టీడీపీ శ్రేణులు ముందుకెళ్లేందుకు యత్నించాయి. అంతటితో ఆగకుండా పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఎంతో సంయమనంతో వ్యవహరించిన పోలీసులు చివరికి గత్యంతరం లేక లాఠీచార్జి ద్వారా వీరిని చెదరగొట్టాల్సి వచ్చింది.

రౌడీమూకల తరలింపు

నెల్లూరు రూరల్‌లో రౌడీయిజాన్ని పెంచి పోషించే టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నెల్లూరు నుంచి రౌడీమూకలను వెంటేసుకొచ్చారు. అలజడి సృష్టించి.. ఘటనను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోవూరు అభ్యర్థి ప్రసన్నకుమార్‌రెడ్డిపై మోపేందుకు కుట్రపన్నారు. నామినేషన్ సందర్భంగా ప్రసన్న ఆర్భాటం చేస్తారని భావించి.. ఆ సమయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులను రెచ్చగొట్టేందుకు కోటంరెడ్డి వ్యూహం పన్నారు. అయితే ప్రసన్నకుమార్‌రెడ్డి ఎంతో నిరాడంబరంగా నామినేషన్ దాఖలు చేయడంతో వీరి పన్నాగం బెడిసికొట్టింది. కోవూరులో అశాంతిని రాజేయడంపై ప్రజలు మండిపడుతున్నారు.

రెండో రోజు 17 నామినేషన్లు

- అసెంబ్లీకి 14.. లోక్‌సభకు మూడు

నెల్లూరు(దర్గామిట్ట): ఎన్నికల నేపథ్యంలో రెండో రోజు శుక్రవారం 17 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిని రిటర్నింగ్ అధికారులకు అభ్యర్థులు సమర్పించారు.

- నెల్లూరు లోక్‌సభ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా రిటైర్డ్ ఐఏఎస్ కొప్పుల రాజు మూడు సెట్ల నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరినారాయణన్‌కు అందజేశారు.
- కందుకూరు నియోజకవర్గం నుంచి రాడికల్ పార్టీ అభ్యర్థిగా బాల్‌కుమార్ ఎండ్లూరి నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి విద్యాధరికి సమర్పించారు.
- ఆత్మకూరు నియోజకవర్గం నుంచి యుగతులసి అభ్యర్థిగా నెల్లూరు కృష్ణారెడ్డి రెండో సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి మధులతకు అందజేశారు.
- నెల్లూరు రూరల్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి.. ఎస్డీపీఐ అభ్యర్థిగా ఫాజిల్ సయ్యద్ తమ నామినేషన్ పత్రాలను ఆర్వో మలోలకు సమర్పించారు.
- కావలి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా కావ్య కృష్ణారెడ్డి మూడు సెట్లు.. కుమార్తె సంహిత రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా ఎల్లు సల్మాన్ రెండు సెట్ల నామినేషన్లను సమర్పించారు.
- కోవూరు, నెల్లూరు సిటీ, ఉదయగిరి, సర్వేపల్లిలో నామినేషన్లు దాఖలు కాలేదు.



నామినేషన్ దాఖలు చేస్తున్న కాంగ్రెస్ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి కొప్పుల రాజు

కాకర్లకు సహకరించేదిలేదు

- బొల్లినేని వర్గీయుల స్పష్టీకరణ
- బుజ్జగించేందుకు వంటేరు విఫలయత్నం

కలిగిరి: టీడీపీ ఉదయగిరి నియోజకవర్గ అభ్యర్థి కాకర్ల సురేష్ వ్యవహార శైలిపై బొల్లినేని వర్గీయులు మండిపడ్డారు. మండలంలోని అనంతపురంలో టీడీపీ నేత, మాజీ ఎంపీపీ రామిరెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. మండలంలోని పలు పంచాయతీల నుంచి బొల్లినేని వర్గీయులు, అనుచరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు పిలుపు మేరకు తన అనుచరులతో కలిసి టీడీపీలో చేరామని చెప్పారు. అయితే పార్టీ అభ్యర్థిగా కాకర్ల సురేష్‌ను ప్రకటించిన నాటి నుంచి తమతో పాటు బొల్లినేని వర్గీయులను పట్టించుకోవడంలేదని ఆరోపించారు. తమ సొంత గ్రామం అనంతపురంలో ప్రచారం నిర్వహించినా, సమాచారమివ్వలేదని చెప్పారు. బొల్లినేని వర్గీయులను పార్టీ కార్యక్రమాలు, ప్రచారాలకు దూరంగా పెడుతున్నారని మండిపడ్డారు. కాకర్లతో పాటు ఆయన అనుచరుల వ్యవహార శైలి పద్ధతిగా లేదని, ఇదే పరిస్థితి కొనసాగితే ఆయన గెలవడం అసాధ్యమన్నారు. కాకర్లకు తాము సహకరించేదిలేదని స్పష్టం చేశారు. కాగా ఇదే సమయంలో రామిరెడ్డికి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి ఫోన్ చేసి బుజ్జగించేందుకు యత్నించారు. కాకర్ల సురేష్ వ్యవహార శైలిని పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ పెద్దల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. అయినా కాకర్లతో కలిసి పనిచేసేందుకు బొల్లినేని వర్గీయులు సుముఖత వ్యక్తం చేయలేదు. నంబూరి సిద్దులునాయుడు, వడ్లమూడి కొండపనాయుడు, కట్టా వెంకటేశ్వర్లు, చిట్టినబోయిన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామిరెడ్డి

సీఎం సమక్షంలో వైఎస్సార్సీపీలోకి మనుక్రాంత్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో జిల్లాకు చెందిన పలువురు జనసేన, టీడీపీ నేతలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో శుక్రవారం చేరారు. కాకినాడలో సీఎం నిర్వహించిన మేమంతా సిద్ధం సభలో వీరు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డి, కాటంరెడ్డి జగదీష్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌యాదవ్, టీడీపీ ఉదయగిరి మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి పార్టీలో చేరారు. వీరికి కండువాలు కప్పి పార్టీలోకి సీఎం ఆహ్వానించారు. పార్టీ నెల్లూరు లోక్‌సభ, నెల్లూరు రూరల్ అభ్యర్థులు విజయసాయిరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



మనది ఫ్యాన్ గుర్తు..: కరపత్రం అందజేస్తున్న సునందారెడ్డి, నేహారెడ్డి



ఓటేస్తావా..: టీడీపీ నాయకుడు ప్రశాంత్‌తో నవ్వులు చిందిస్తున్న ఖలీల్



అవ్వా బాగున్నావా..: కరపత్రం అందజేసి యోగక్షేమాలు తెలుసుకుంటున్న నిహారికారెడ్డి



ఆత్మీయంగా..: వృద్ధుడిని ఓటు అభ్యర్థిస్తున్న పూజిత

ఆప్యాయంగా పలకరిస్తూ..

ప్రచార పర్వం

జిల్లాలో ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు ప్రజలను ఆప్యాయంగా పలకరించి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. నెల్లూరు పార్లమెంట్ సభ్యుడిగా వేణుంబాక విజయసాయిరెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన సతీమణి సునందారెడ్డి, కుమార్తె నేహారెడ్డి శుక్రవారం కొడవలూరు మండలం పెయ్యలపాళెంలో విస్తృతంగా ప్రచారం చేశారు. వారికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ అభ్యర్థి ఎండీ ఖలీల్ అహ్మద్ నగరంలోని 51వ డివిజన్‌లో పర్యటించారు. కరపత్రాలు అందజేసి మీలో ఒకడినని, ఆశీర్వదించాలని కోరారు. ఉదయగిరి అసెంబ్లీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ఆయన కోడలు నిహారికారెడ్డి ఉదయగిరిలోని పలు ప్రాంతాల్లో ప్రచారం చేశారు. సర్వేపల్లి ఎమ్మెల్యేగా కాకాణి గోవర్ధన్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ ఆయన కుమార్తె పూజిత మనుబోలులో విస్తృతంగా ప్రచారం చేశారు.

– కొడవలూరు/నెల్లూరు ఫొటోగ్రాఫర్/ఉదయగిరి/మనుబోలు

క్లుప్తంగా

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

మనుబోలు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు పూర్తిగా కాలి బూడిదైన ఘటన మండల పరిధిలోని అనుపల్లిపాడు గ్రామంలో శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. గుండుబోయిన అశోక్ అనే వ్యక్తి పూరింట్లో ఎవరూ లేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి. ధాన్యం విక్రయించగా వచ్చిన రూ.2 లక్షల నగదు, 10 సవర్ల బంగారు ఆభరణాలు, దుస్తులు, నిత్యావసర సరుకులు, ఇతర వస్తువులు కాలిపోయినట్లు బాధితుడు అశోక్ వాపోయాడు. సమాచారం అందుకున్న వీఆర్వో శ్రీనివాసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి నివేదికను అధికారులకు పంపినట్లు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి



యువకుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

పొదలకూరు: మండలంలోని సూరాయపాళెం గ్రామానికి సమీపంలో కనుపూరు కాలువ వద్ద చేపల వేటకు వెళ్లి గుర్తుతెలియని యువకుడు మృతిచెందాడు. గ్రామ వీఆర్వో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై రామకృష్ణ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. గురువారం చేపల వేటకు కాలువలో దిగి ప్రమాదవశాత్తు మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతుడి వయసు 25 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండొచ్చని భావిస్తున్నారు. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోను ఢీకొన్న ట్రాక్టర్

- ఐదుగురికి తీవ్రగాయాలు



ఘటనా స్థలంలో ఆటో

పొదలకూరు: మండలంలోని అల్లూర్తి బ్రాంచి రోడ్డులో శుక్రవారం ఆటోను ట్రాక్టర్ ఢీకొనడంతో ఐదుగురు గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. చెన్నారెడ్డిపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు తన ఆటోలో అల్లూర్తి గ్రామం మీదుగా పొదలకూరుకు ప్రయాణికులతో వస్తున్నాడు. దారిలో నిమ్మతోట నుంచి మెయిన్‌రోడ్డుపైకి వస్తున్న ట్రాక్టర్ ఆటోను వేగంగా ఢీకొంది. దీంతో అది బోల్తాపడి అందులోని నలుగురు, వెంకటేశ్వర్లు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులు మెరుగైన చికిత్స కోసం నెల్లూరు జీజీహెచ్‌కు వెళ్లారు. మనుబోలు మండలం వీరంపల్లికు చెందిన వారు అల్లూర్తికి చుట్టుపుచూపుగా వచ్చి ప్రమాదం బారిన పడ్డారని తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చెరువులో పడి యువకుడి గల్లంతు

మనుబోలు: ఓ యువకుడు చెరువులో దిగి గల్లంతయ్యాడు. ఈ ఘటన మనుబోలు మండలంలోని వడ్లపూడి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కోసూరు వెంకటేష్ (27) పశువులను మేత కోసం పొలానికి తోలుకుని వెళుతున్నాడు. దారిలో ఓ గేదె చెరువులోకి దిగడంతో దాన్ని అదిలించేందుకు వెంకటేష్ దిగి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న ఎస్సై అజయ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. గజ ఈతగాళ్లను రప్పించి గాలింపు చర్యలు చేపట్టారు. అయినా యువకుడి ఆచూకీ లభించలేదు. తమ బిడ్డ ఏమయ్యాడంటూ కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి.

పెత్తందారులపైనే చంద్రబాబుకు ప్రేమ

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న, ఎమ్మెల్సీ కళ్యాణ్ చక్రవర్తి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: 'చంద్రబాబు నాయుడికి పెత్తందారులపైనే ప్రేమ ఉంది. వారి కోసమే ఆయన పనిచేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మొదటి నుంచి పేదల పక్షాన ఉన్నారు. ఐదేళ్లలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారు' అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని మునులపూడి గ్రామ పంచాయతీ పరిధిలోని రెడ్డిపాళెం, బట్టబడి దిన్నె, కొండయగుంట కాలనీల్లో శుక్రవారం ఆయన ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం సభలో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ పాలనకు, గత టీడీపీ పాలనకు ప్రజలు బేరీజు వేసుకోవాలన్నారు. ఈ ప్రభుత్వ హయాంలో మునులపూడి గ్రామ పంచాయతీకి డీబీటీ, నాన్ డీబీటీ కింద రూ.14.50 కోట్ల మేర అందించినట్లు వివరించారు. వివిధ నిధులతో సీసీరోడ్లు, డ్రెయిన్లు నిర్మించామన్నారు. నాడు – నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చడం జరిగిందని తెలిపారు. గ్రామ కొలను పథకం కింద చెరువు ఆధునీకరణకు రూ.1.20 కోట్లు కేటాయించామన్నారు. కరోనా లాంటి విపత్తును తట్టుకుని పేదలకు సంక్షేమ పథకాలను ఎలాంటి ఆటంకాలు లేకుండా తమ ప్రభుత్వం అందించిందన్నారు.

ఫ్లోరైడ్ సమస్య ఎక్కడుంది?

ఇటీవల రెడ్డిపాళెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గ్రామంలో ఫ్లోరైడ్ సమస్య ఉందని, అధికారంలోకి వస్తే సమస్యను పరిష్కరిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. లేని సమస్యను ఎలా పరిష్కరిస్తారని ప్రశ్నించారు. ప్రతి ఆరునెలలకోసారి నీటిని ల్యాబ్‌లో పరీక్షించడం జరుగుతుందన్నారు. అందరూ ఆరోగ్యంగానే ఉన్నారని తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి, టౌన్ కన్వీనర్ మల్లికార్జున రెడ్డి, సచివాలయాల కన్వీనర్ మోర్ల మురళి తదితరులు పాల్గొన్నారు.

గెలిపించండి.. అందుబాటులో ఉంటా



వైఎస్సార్‌సీపీ కండువా కప్పుతున్న మధుసూదన్ యాదవ్

కందుకూరు: 'ఎన్నికల్లో నన్ను గెలిపించండి. మీ అందరికీ అందుబాటులో ఉంటా. సమస్యలను పరిష్కరిస్తా' అని వైఎస్సార్‌సీపీ కందుకూరు అసెంబ్లీ అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ తెలిపారు. ఉలవపాడు మండలం కొల్లూరుపాడు ఎస్సీ కాలనీలో టీడీపీకి చెందిన ఎం.రాజేష్, జొన్నలగడ్డ లక్ష్మి, కోడూరి అన్నపూర్ణ, అశ్విత, మామిడి సుబ్బమ్మ, సోపాటి ఈశ్వరమ్మ, మామిడి ఈశ్వరమ్మ, గద్దల సునీల్, కోడూరి మోహన్, సౌజన్య, కోడూరి యలమంద, సంగీత, పి. నాగమ్మ, టి. కార్తీక్, రాయపాటి కోటేశ్వరమ్మ తదితరులు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో వారికి బుర్రా కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారని చెప్పారు. దళితులకు పెద్ద సంఖ్యలో పదవులిచ్చి వారి రాజకీయ ఎదుగుదలకు బాటలు వేశారని గుర్తు చేశారు. పేద పిల్లలు చదువుకునే పాఠశాలలను కార్పొరేట్ కంటే మిన్నగా అభివృద్ధి చేశారని చెప్పారు. ఈ మంచి ఇలాగే కొనసాగాలంటే మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన ప్రతి ఒక్కరినీ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఉలవపాడు మండలాధ్యక్షుడు ఎన్.పోతురాజు, నాయకులు కోటు కోటిలింగం, సుధాకర్, కొండూరి వసంత రావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీధర్‌రెడ్డీ.. సంస్కారం నేర్చుకో

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వైవీ రామిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రామిరెడ్డి, పక్కన వైఎస్సార్‌సీపీ నాయకులు

నెల్లూరు(దర్గామిట్ట): 'కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నీ చరిత్ర.. నీ అవినీతి, అక్రమాల గురించి జిల్లా ప్రజలకు బాగా తెలుసు. ఎన్నికల్లో రూరల్ నియోజకవర్గంలో ఓటమి తప్పదని అర్థమైపోయి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నావు. సంస్కారవంతంగా మాట్లాడడం నేర్చుకో' అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వైవీ రామిరెడ్డి అన్నారు. నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భూకబ్జాలు, రౌడీయిజం, అసాంఘిక కార్యకలాపాలకు శ్రీధర్‌రెడ్డి కేరాఫ్ అన్నారు. అలాంటి నీకు అనునిత్యం ప్రజల కోసం పరితపించే ఆదాల ప్రభాకర్‌రెడ్డిని విమర్శించే స్థాయి లేదన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో జిల్లా ప్రజల సంక్షేమం కోసం ఆదాల రూ.45 లక్షల పైగా జిల్లా ఉన్నతాధికారులకు అందజేసి సేవా కార్యక్రమాలు చేయాలని చెప్పి దాతృత్వాన్ని చాటుకున్నారన్నారు. సాయం చేసినట్లు ఆయన ఎక్కడా చెప్పుకోలేదన్నారు. ఒక్క రూపాయి ఖర్చు పెట్టి రూ.100 పెట్టినట్లు కోటంరెడ్డి ఆర్భాటం చేస్తుంటాడన్నారు. వారిద్దరి మధ్య చాలా తేడా ఉందన్నారు. 2014 ముందు నీకు సహాయ, సహకారాలు అందించిన వారు ఇప్పుడెందుకు దూరమయ్యారో బయట పెట్టమంటావా అని శ్రీధర్‌రెడ్డిని రామిరెడ్డి ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు స్వర్ణా వెంకయ్య, జీవీ ప్రసాద్, పాలకీర్తి రవికుమార్, సయ్యద్ హయత్ బాబా, టీవీఎస్ కమల్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో క్యాన్సర్‌కు ఆధునిక చికిత్స



సూపరింటెండెంట్‌తో చర్చిస్తున్న విశాఖ వైద్య బృందం

నెల్లూరు(అర్బన్): విశాఖపట్నంలోని హోమీ బాబా క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో క్యాన్సర్ రోగులకు ఆధునిక చికిత్స అందించేందుకు నెల్లూరులోని జీజీహెచ్‌లో చర్యలు చేపట్టామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్ తెలిపారు. శుక్రవారం విశాఖ నుంచి సదరు ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ ఉమేష్‌మహంతిశెట్టి ఆధ్వర్యంలో డాక్టర్ల బృందం దర్గామిట్టలోని జీజీహెచ్‌ను సందర్శించింది. బృంద సభ్యులు ఇక్కడి క్యాన్సర్ విభాగాన్ని పరిశీలించారు. ఇతర సౌకర్యాలు కల్పించేందుకు కావాల్సిన వసతుల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్, అంకాలజీ విభాగం డాక్టర్లతో వారు సమావేశమయ్యారు. అనంతరం డాక్టర్ సిద్ధానాయక్ మాట్లాడుతూ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, వైద్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాలో క్యాన్సర్ నిర్మూలనకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. హోమీబాబా క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డాక్టర్ల బృందం రోగులను గుర్తించడం, అవగాహన కల్పించడంపై జిల్లాలోని పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ (ఎంఎల్‌హెచ్‌పీ), ఆశా కార్యకర్తలు, నర్సింగ్ సిబ్బందికి వచ్చే నెల నుంచి శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. శిక్షణతోపాటు స్క్రీనింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి డాక్టర్ల ద్వారా పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. క్యాన్సర్ నిర్ధారణ అయిన వారికి ఉచితంగా చికిత్స అందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రోగులకు రేడియేషన్ ఇచ్చేందుకు అవసరమైన లీనాక్ మెషీన్ను ఏర్పాటు చేయాలని కోరగా ఇన్‌స్టిట్యూట్ వారు అంగీకరించారు. అనంతరం వైద్యబృందం, సూపరింటెండెంట్ కలెక్టర్ హరినారాయణన్‌తో చర్చించారు. కార్యక్రమంలో డాక్టర్లు దయరోజా, స్నేహాశర్మ, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర, డాక్టర్ మస్తాన్‌బాషా, క్యాన్సర్ విభాగం, గైనిక్, ఈఎన్‌టీ తదితర విభాగాల డాక్టర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో 70 కుటుంబాల చేరిక



పార్టీలో చేరిన వారితో రామిరెడ్డి

కావలి: పట్టణంలోని 16 వార్డు పరిధిలో ఉన్న చంద్రబాబు నాయుడు కాలనీకి చెందిన 70 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. కావలిలోని తన నివాసంలో శుక్రవారం వారికి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. 16వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పేరం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. రామిరెడ్డి మంచి మనసున్న వ్యక్తి అని వారు తెలిపారు. అన్నా అంటూ అభిమానంగా పిలుస్తారని, అందరినీ గౌరవించే వారే కావలికి ఎమ్మెల్యేగా ఉండాలన్నారు. ప్రతాప్‌కుమార్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, షేక్ నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి : రూ.75
సన్నవి : రూ.60
పండ్లు : రూ.26



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 141	బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 280
లేయర్ (లైవ్) : 98	లేయర్ చికెన్ : 167
బ్రాయిలర్ చికెన్ : 250	

